TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

సంపుటి : 01 సంచిక : 249 | గురువారం మే 15 2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

» ప్రమాణ స్వీకారం చేయించిన రాష్ట్రపతి
» పాల్గొన్న ఉపరాష్ట్రపతి, మాజీ రాష్ట్రపతి, ప్రధాని
» 2005లో శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి
» సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా గవాయ్ విశేష సేవలు





## 52వ సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్

**న్యూఢిల్లీ, మే14 :**
న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయ్ భారత ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా స్థానంలో బుధవారం 52వ సీజేఐ బీఆర్ గవాయ్ బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జస్టిస్ బీఆర్ గవాయ్ చేత ప్రమాణం చేయించారు. సీజేఐగా బీఆర్ గవాయ్ ప్రమాణ స్వీకారం చేసిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన?ర్, మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. తాజా ప్రమాణ స్వీకారంతో భారతదేశంలో ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన తొలి బౌద్ధుడిగా చరిత్ర సృష్టించారు. ఈ ఏడాది నవంబర్ 23న గవాయ్ పదవి విరమణ చేయనున్నారు. 1960 నవంబరు 24న మహారాష్ట్రలోని అమరావతిలో జన్మించారు బీఆర్ గవాయ్. ఆయన తండ్రి రామకృష్ణ గవాయ్ రాజ్యసభ మాజీ సభ్యుడు. మహారాష్ట్రలో ప్రముఖ నేత. బీఆర్ గవాయ్ నాగ్‌పూర్ యూనివర్సిటీలో లా డిగ్రీ పొందారు. 25 ఏళ్ల వయసులో 1985 మార్చి 16న న్యాయవాదిగా కెరీర్ మొదలుపెట్టారు. వృత్తిలో రాణిస్తూ అంచెలంచెలుగా ఎదిగిన ఆయన 2003 నవంబరులో బాంబే హైకోర్టులో అడిషనల్ జడ్జిగా నియమితులయ్యారు. 2005 నవంబర్ నెలలో శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ముంబై, నాగ్‌పూర్, ఔరంగాబాద్, పనాజీ ధర్మాసనాల్లో బీఆర్ గవాయ్ న్యాయమూర్తిగా సేవలందించారు. ఈ క్రమంలో 2019 మే 24న సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. దాదాపు గత ఆరేళ్ల కాలంలో ఆయన కొన్ని వందల ధర్మాసనాల్లో భాగస్వామ్యం పంచుకొని ఎన్నో రాజ్యాంగ, సివిల్, క్రిమినల్ చట్టాలు, ఆర్బిట్రేషన్, వాణిజ్య వివాదాలు విద్య, పర్యావరణం లాంటి పలు కేసుల విచారణ చేపట్టారు.

2లో..



## సీఐపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆగ్రహం

హైదరాబాద్:
తమ ప్లాట్లను కబ్జా చేశారని పలువురు బాధితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా కోహెడలో వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. భూమిలో మారణాయుధాలు చూసి ఆగ్రహానికి లోనయ్యారు.

2లో..

## త్వరలోనే 'గ్రూప్స్' ఉద్యోగ నియామకాలు

హైదరాబాద్:
ప్రాజెక్టుల నాణ్యత విషయంలో ఇంజినీర్లు ఎవరి ఒత్తిళ్లకు లొంగవద్దని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ జలసౌధ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కొలువుల పండుగ కార్యక్రమంలో నీటిపారుదల శాఖలో ఏఈ, జేటీవో పోస్టులకు ఎంపికైన వారికి సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు."ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రాష్ట్రానికి ఎప్పుడూ ప్రాధాన్యత ఇచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలోనే ఏపీలో భారీ ప్రాజెక్టులకు నెహ్రూ శంకుస్థాపన చేశారు. నెహ్రూ శంకుస్థాపన చేసిన నాగార్జునసాగర్, శ్రీశైలంతోనే మనకు నీళ్లు అందుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం 50, 60 ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాజెక్టులే ఈనాటికి మనకు నీళ్లు ఇస్తున్నాయి. నాగార్జున సాగర్, శ్రీరామ్‌సాగర్ ఎన్నో వరదలు, ఉపద్రవాలను తట్టుకుని నిలబడ్డాయి. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టిన కాళేశ్వరం మాత్రం మూడేళ్లలోనే కూలింది. కట్టిన మూడేళ్లలోనే కూలిన ప్రాజెక్టు ప్రపంచంలో మరెక్కడా లేదు.



2లో..

## జీహెచ్ఎంసీలో ట్రాన్స్ జెండర్ల నియామకాలు!

హైదరాబాద్:
జీహెచ్ఎంసీ(గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీ కార్పొరేషన్)లో ట్రాన్స్ జెండర్ల నియామకానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బల్దియాలోని పలు విభాగాల్లో ఔట్ సోర్సింగ్ విధానంలో ట్రాన్స్ జెండర్లను తీసుకోవాలని నిర్ణయించారు. జీహెచ్ఎంసీ పార్కులు, గ్రౌండ్స్, వాటర్ బోర్డు రిజర్వాయర్ల వద్ద సెక్యూరిటీ గార్డులుగా నియమించేలా అధికారులు ప్లాన్ చేస్తున్నారు. ఇక స్ట్రీట్ లైట్స్ మెయింటెనెన్స్, గ్రీన్ మార్షల్స్ గా అవకాశాలను సైతం అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ మేరకు బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ట్రాన్స్ జెండర్లతో సమావేశం ఏర్పాటు చేసి.. వారికి ఉపాధి వివరాలను అధికారులు తెలిపారు.

## అమెరికాలో నల్గొండ విద్యార్థిని కన్నుమూత



అమెరికా:
ఉన్నత చదువులకోసం విదేశాలకు వెళ్లిన మరో భారతీయ విద్యార్థి కన్నుమూసింది. ఇటీవలి కాలంలోఅమెరికాలో భారత విద్యార్థుల మృతుల సంఖ్య ఆందోళనకరంగా మారుతోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండటం మరింత విషాదం. తాజాగా మరో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. నల్గొండ జిల్లా కట్టంగూరు మండలం పందెనపల్లికి చెందిన యువతి మృతి చెందింది.

2 లో



## హైదరాబాద్ లోని మిసైల్ తయారీ సంస్థలకు కేంద్రం ఆర్డర్..!

హైదరాబాద్:
పహల్గాం టెర్రరిస్ట్ ఎటాక్, ఆపరేషన్ సిందూర్?తో భారత్, పాక్ మధ్య పరిస్థితులు తారాస్థాయికి చేరుకున్నాయి. ఇరు దేశాలు డ్రోన్లు, మిస్సైళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఈ పరిణామాలతో పాక్, భారత్ మధ్య యుద్ధం మొదలైనట్లేనని అనుకుంటుండగా రంగంలోకి దిగిన అమెరికా ఇరు దేశాలతో మాట్లాడి కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదిర్చింది.



## చారిత్రక ఓరుగల్లులో అందాల భామల సందడి

వరంగల్:
ప్రపంచ సుందరి పోటీలో పాల్గొనే సుందరీమణులు బుధవారం చారిత్రక ఓరుగల్లు నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా అతిథులకు తెలంగాణ సంప్రదాయం ప్రకారం బతుకమ్మ, మేళతాళాలతో స్థానిక మహిళలు, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, సీపీ సన్‌ప్రీత్‌సింగ్, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు.

2 లో



## నేటినుండి కాళేశ్వరం సరస్వతి పుష్కరాలు..

» 12 ఏళ్ల తరువాత జరుతున్న పుష్కరాలు » పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి » రూ.25 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం » హారతి కార్యక్రమాన్ని ప్రారంభించనున్న సిఎం రేవంత్ » సరస్వతి పుష్కరాలకు ఆర్టీసీ సన్నద్ధం » హైదరాబాద్ నుంచి కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులు

కాళేశ్వరం, మే14:
జయశంకర్ భూపాలపల్లి కాళేశ్వరంలో నేటి నుంచి ఈ నెల 26వ తేదీ వరకు సరస్వతి నది పుష్కరాలు జరగనున్నాయి. 12 ఏళ్లకోసారి నిర్వహించే ఈ పుష్కరాలు ఈ ఏడాది నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పుష్కరాలకు తెలంగాణతో పాటు ఏపీ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి కూడా ఆ భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు..

## 6000 మంది ఉద్యోగులు తొలగింపు

» టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కీలక నిర్ణయం
» 3 శాతం ఉద్యోగులను తొలగిస్తున్న సంస్థ




న్యూఢిల్లీ, మే14
ఇటీవల గూగుల్ లేఆఫ్స్ తర్వాత ఇప్పుడు మరో టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కూడా ఉద్యోగులను తొలగించనుంది. 6000 మంది ఉద్యోగులు అంటే మొత్తం ఉద్యోగులలో దాదాపు 3 శాతం మందిని మైక్రోసాఫ్ట్ తొలగించనుంది. ఇందులో అన్ని స్థాయిల ఉద్యోగులు ఉండనున్నారు. ఇది సంస్థపై విస్తృత ప్రభావం చూపుతుంది. గతంలో 2023లో మైక్రోసాఫ్ట్ 10,000 మంది ఉద్యోగులను తీసివేసింది. కంపెనీ చరిత్రలో అది అతిపెద్ద ఉద్యోగుల తొలగింపు కాగా, తాజాగా తీసుకుంటున్న నిర్ణయం మైక్రోసాఫ్ట్ చరిత్రలో 2వ అతిపెద్ద లేఆఫ్స్ అని చెప్పవచ్చు. కంపెనీ నుంచి తొలగింపునకు గురైన ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ సంస్థ రెండు ఛాయిస్‌లు ఇస్తుంది.

2 లో

## కర్రెగుట్ట ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులు మృతి: డీజీపీ అరుణ్‌దేవ్ గౌతం




చర్ల:
తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు బీజాపూర్ జిల్లా ఉసురు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కర్రెగుట్ట కేంద్రంగా జరిగిన ఆపరేషన్‌లో 31మంది మావోయిస్టులు మృతి చెందినట్లు సీఆర్పీఎఫ్ డీజీ జీపీ సింగ్, ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ గౌతం తెలిపారు. బుధవారం బీజాపూర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆపరేషన్ జరిగిన 21 రోజుల్లో 31 మంది మావోయిస్టులు మృతి చెందారని, వీరిలో 16 మంది మహిళా మావోయిస్టులు ఉన్నట్లు తెలిపారు.ఈ ఆపరేషన్‌లో మృతి చెందిన మావోయిస్టులపై రూ.1.72 కోట్ల రివార్డు ఉందని పేర్కొన్నారు. 18 మంది జవాన్లు గాయపడినట్లు చెప్పారు. మృతి చెందిన మావోయిస్టుల్లో 20 మందిని గుర్తించామని, ఇంకా 11 మందిని గుర్తించాల్సి ఉందన్నారు. 31 మంది మావోయిస్టుల నుంచి 35 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 21 నుంచి మే 11 వరకు కర్రెగుట్ట ఆపరేషన్ నిర్వహించామన్నారు. ఈఏడాది మావోయిస్టులకు వ్యతిరేకంగా జరిగిన ఆపరేషన్‌లో 174 మంది హార్డ్ కోర్ మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

# 52వ సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్

మొదటి పేజీ తరువాయి
తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లోకి ఫిరాయించిన పిటిషన్లను గవాయ్ బెంచ్ విచారిస్తున్న విషయం తెలిసిందే. 51వ సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవి విరమణ చేయడం, తన తరువాత బీఆర్ గవాయ్ పేరును సిఫార్సు చేశారు. 52వ సీజేఐగా ఇటీవల నియమితులైన జస్టిస్ బీఆర్ గవాయ్ బుధవారం నాడు రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీంకోర్టులో జస్టిస్ భూషణ్ గవాయ్ కీలక తీర్పులు ఇచ్చారు. 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయాన్ని సమర్థించిన సుప్రీంకోర్టు ధర్మాసనంలో గవాయ్ సభ్యులు. నోట్ల రద్దు కేసు గురించి జస్టిస్ గవాయ్ తీర్పు చెబుతూ.. 'భారతీయ రిజర్వ్ బ్యాంక్ చట్టంలోని సెక్షన్ 26(2) కింద ఇచ్చిన అధికారాలను ఉపయోగించి అన్ని రకాల నోట్లను నిషేధించవచ్చు. ఈ విభాగంలో ఉపయోగించిన 'ఏదైనా' అనే పదాన్ని పరిమితంగా కాకుండా విస్తృత కోణంలో అర్థం చేసుకోవాలి' అని వ్యాఖ్యానించారు. షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) రిజర్వేషన్ ఫ్రేమ్‌వర్క్‌లో ఉప-వర్గీకరణ రాజ్యాంగబద్ధంగా అనుమతించొచ్చని 2024లో సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. జస్టిస్ భూషణ్ గవాయ్ ఈ ధర్మాసనంలో భాగం. ఈ కేసులో భాగంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ నిబంధనను ప్రవేశపెట్టాలని తీర్పు చెప్పిన వారిలో జస్టిస్ గవాయ్ ఒకరు. ఈ కేసు తీర్పులో భాగంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ 'రాజ్యాంగంలో పొందుపరిచినట్లుగా ప్రతి ఒక్కరినీ సమానంగా చూసేలా ఈ దశ సహాయపడుతుంది. అయితే, ఇతర వెనుకబడిన తరగతుల(ఓబీసీలు) మాదిరిగానే షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) కోసం కూడా క్రీమీలేయర్‌ను అమలు చేయడానికి ప్రభుత్వం నిర్దిష్ట ప్రమాణాలను రూపొందించాలి. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రమాణాలు భిన్నంగా ఉండవచ్చు' అని అన్నారు. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసినప్పుడు, ఆ నిర్ణయాన్ని కొందరు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అయితే, కేంద్ర ప్రభుత్వ చర్యను సమర్థిస్తూ సుప్రీంకోర్టు డిసెంబర్ 2023లో తీర్పును వెలువరించింది. ఈ తీర్పు ఇచ్చిన రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ భూషణ్ గవాయ్ కూడా ఒకరు. 'ఎలక్టోరల్ బాండ్ స్కీం' రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించిన సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలోనూ గవాయ్ సభ్యులు. దాతల వివరాలు చెప్పకపోవడమనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(జీ) కింద పౌరుల సమాచార హక్కును ఉల్లంఘిస్తోందని ఈ ధర్మాసనం అభిప్రాయపడింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో నిందితుల ఇళ్ల కూల్చివేతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనానికి జస్టిస్ గవాయ్ నాయకత్వం వహించారు. కూల్చివేతలను ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది, తగిన ప్రక్రియను పాటించకుండా ఆస్తులను ధ్వంసం చేయడం చట్టవిరుద్ధమని పేర్కొంది. నిందితుల ఇళ్లపై ఇటువంటి చర్యలు తీసుకునే ముందు అనుసరించాల్సిన విధానపరమైన చర్యలను కోర్టు నిర్దేశించింది. ఈ మార్గదర్శకాలను దేశవ్యాప్తంగా వర్తింపజేయడం జరిగింది. ఈ నియమాలను అమలు చేయడానికి తగిన సర్క్యులర్‌లను జారీ చేయాలని అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను కూడా సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. రాహుల్ గాంధీపై దాఖలైన పరువు నష్టం కేసులో సూరత్ సెషన్స్ కోర్టు ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. అయితే, గరిష్ఠ శిక్ష విధించడానికి దిగువ కోర్టు నిర్దిష్ట కారణాలను అందించలేదని పేర్కొంటూ సుప్రీంకోర్టు శిక్షను నిలిపివేసింది. జస్టిస్ భూషణ్ గవాయ్ నేతృత్వంలోని బెంచ్ ఈ కేసును విచారించింది. అయితే, విచారణ సమయంలో జస్టిస్ గవాయ్ తన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో ఉన్న దీర్ఘకాల అనుబంధాన్ని పేర్కొంటూ స్వచ్ఛందంగా కేసు నుంచి తప్పుకునేందుకు ముందుకొచ్చారు. చివరికి, కేసును గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనమే విచారించింది. జస్టిస్ భూషణ్ గవాయ్ నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం 2023లో సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్‌కు బెయిల్ మంజూరు చేసింది. 2002లో గుజరాత్ అల్లర్లకు కుట్ర పన్నారనే ఆరోపణలు తీస్తాపై ఉన్నాయి. 'లిక్కర్ స్కాం' కేసులో అరెస్టయిన దిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు 2024లో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. న్యాయమూర్తులు భూషణ్ గవాయ్, కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ముందు సిసోడియా బెయిల్ విచారణ జరిగింది. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో, 17 నెలలు కస్టడీలో గడిపిన సిసోడియా జైలు నుంచి విడుదలయ్యారు. భారత ప్రధాన న్యాయమూర్తికి సంబంధించి సోషల్ మీడియా ఎ÷-లాట్‌ఫాం 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేసి సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని సుప్రీంకోర్టు భావించింది. ఈ విషయాన్ని కోర్టు సుమోటోగా స్వీకరించింది. ఈ కేసును న్యాయమూర్తులు అరుణ్ మిశ్రా, భూషణ్ గవాయ్, కృష్ణ మురారిలతో కూడిన ధర్మాసనం విచారించింది. ప్రశాంత్ భూషణ్ పోస్టు కోర్టు ధిక్కారమని బెంచ్ తేల్చింది.

## సీఐపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి
ఈ సందర్భంగా..బాధితులపై దాడి జరిగినా కేసు ఎందుకు నమోదు చేయలేదని హయత్ నగర్ సీఐపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాధితుల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయాలని సూచించారు. వారికి న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

### హైడ్రా కార్యాలయంలో ప్రజావాణి

హైదరాబాద్ హైడ్రా కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రతి సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేలా హైడ్రా ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన వస్తోంది. బాధితుల నుంచి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఫిర్యాదులను స్వయంగా స్వీకరిస్తున్నారు. అందిన ఫిర్యాదులపై విచారణ చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. అయితే,ప్రజా వాణిలో కోహెడలో తమ భూమి కబ్జాకు గురైందని, ఫిర్యాదు చేసినా హయత్ నగర్ సీఐ పట్టించుకోవడం లేదంటూ ఏవీ రంగనాథ్ ఎదుట ఏకరవు పెట్టుకున్నారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఏవీ రంగనాథ్ స్వయంగా వివాదాస్పద స్థలాన్ని సందర్శించారు. బాధితులతో మాట్లాడారు.

## హైదరాబాద్ లోని మిసైల్ తయారీ సంస్థలకు కేంద్రం ఆర్డర్..!

మొదటి పేజీ తరువాయి
దీంతో యుద్ధ పరిస్థితులు సద్దుమణిగి.. సరిహద్దు దగ్గర ఇప్పుడిప్పుడే శాంతి వాతావరణం నెలకొంటుంది.అయితే.. కాల్పులు విరమణ కుదిరినప్పటికీ.. పాక్ వక్ర బుద్ధి తెలిసిన భారత్ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటుంది. భారత్?పై పీకల దాకా విషం నింపుకుని ఉండే పాక్.. ప్రపంచ దేశాల నుంచి ఎదురయ్యే ఒత్తిడి, భారత్ మెరుపు దాడులతో అతలాకూతులం కావడం వల్ల చేసేదేమి లేక సీజ్ ఫైర్ కు అంగీకరించింది. పాక్ ఏ నిమిషమైనా తన జిత్తులమారి బుద్ధి చూపించే అవకాశం ఉండటంతో భారత్ తన ఆయుధ సంపత్తిని మరింత పటిష్టం చేసుకోవడంపై దృష్టి సారించింది.ఈ క్రమంలోనే.. బ్రహ్మోస్, ఆకాశ్ వంటి క్షిపణుల తయారీదారులను ఉత్పత్తిని వేగవంతం చేయాలని భారత ప్రభుత్వం ఆదేశించింది. ముఖ్యంగా.. భారతదేశ క్షిపణి రాజధాని హైదరాబాద్‌లో ఉన్న రక్షణ ఆయుధాల తయారీదారులను దేశంలో క్షిపణ నిల్వలను పెంచడానికి ఉత్పత్తిని పెంచి డెలివరీలు స్పీడప్ చేయాలని కోరింది.హైదరాబాద్‌లో డీఆర్డీవో, భారత్ డైనమిక్స్ (BDL), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (BEL), అదానీ ఎల్బిట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, కళ్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (KRAS), MTAR టెక్నాలజీస్, ఆస్ట్రా మైక్రోవేవ్, అనంత్ టెక్నాలజీస్, రఘు వంశీ, జెన్ టెక్నాలజీస్, SEC ఇండస్ట్రీస్ వంటి అనేక ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు ఉన్నాయి. పాక్?తో ఉద్రిక్తతల నేపథ్యంలో మిసైళ్ల తయారీ ఉత్పత్తిని పెంచి.. వేగంగా డెలివరీ చేయాలని కేంద్ర ఈ సంస్థలకు ప్రభుత్వం సూచించింది.పాక్ తో యుద్ధ వాతావరణం నెలకొనడంతో డెలివరీలను వేగవంతం చేయడానికి వీకెండ్?లో కూడా పని చేయమని కేంద్ర ప్రభుత్వం కోరిందని ఆకాష్, బ్రహ్మోస్ మిసైళ్ల పరికరాలు తయారు చేసే హైదరాబాద్ కంపెనీ ప్రమోటర్ వెల్లడించారు. కాగా, 2019 ఫిబ్రవరిలో బాలాకోట్ వైమానిక దాడిలో ఉపయోగించిన స్పైస్ 2000 క్షిపణులను హైదరాబాద్‌లోని కళ్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (KRAS) లో తయారు చేసిన విషయం తెలిసిందే.

## టర్కీ మార్బుల్స్ దిగుమతి నిలిపివేత

భారత-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో, పాకిస్థాన్‌కు మద్దతుగా నిలుస్తున్న టర్కీకి వాణిజ్యపరంగా గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే పుణేలోని వ్యాపార వర్గాలు టర్కీ నుంచి యాపిల్స్ దిగుమతులను నిలిపివేయగా... అదే కోవలో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ మార్బుల్ వ్యాపారులు టర్కీ నుంచి మార్బుల్ దిగుమతులను పూర్తిగా నిలిపివేయాలని సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ చర్య ద్వారా భారత ప్రభుత్వానికి తమ సంఘీభావాన్ని ప్రకటించడంతో పాటు, దేశీయ మార్బుల్ పరిశ్రమకు ఊతమివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఆసియాలోనే అతిపెద్ద మార్బుల్ ఎగుమతి కేంద్రంగా పేరుగాంచిన ఉదయ్‌పూర్‌లో, మార్బుల్ ప్రాసెసర్స్ కమిటీ ఈ మేరకు కీలక తీర్మానం చేసింది. కమిటీ అధ్యక్షుడు కపిల్ సురానా ఈ విషయాన్ని వెల్లడిస్తూ, "పాకిస్థాన్‌కు టర్కీ అందిస్తున్న మద్దతును నిరసిస్తూ, మా కమిటీ సభ్యులందరూ ఏకగ్రీవంగా టర్కీతో వ్యాపార సంబంధాలను తెంచుకోవాలని నిర్ణయించారు" అని తెలిపారు. భారతదేశానికి దిగుమతి అయ్యే మొత్తం మార్బుల్‌లో దాదాపు 70 శాతం టర్కీ నుంచే వస్తుందని ఆయన గుర్తుచేశారు.ఈ నిర్ణయం కేవలం ఉదయ్‌పూర్‌కే పరిమితం కాకూడదని సురానా ఆకాంక్షించారు. "దేశంలోని అన్ని మార్బుల్ సంఘాలు టర్కీతో వాణిజ్యాన్ని నిలిపివేస్తే, అది ప్రపంచానికి ఒక బలమైన సందేశాన్ని పంపుతుంది. భారత ప్రభుత్వం ఒంటరి కాదని, దేశంలోని పరిశ్రమలు మరియు యావత్ భారతీయులు ప్రభుత్వానికి అండగా నిలుస్తారని స్పష్టమవుతుంది," అని ఆయన అభిప్రాయపడ్డారు.టర్కీతో వాణిజ్యం నిలిచిపోవడం వల్ల భారతీయ మార్బుల్‌కు డిమాండ్ గణనీయంగా పెరుగుతుందని, తద్వారా దేశీయ పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని కపిల్ సురానా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ 'బాయ్‌కాట్ టర్కీ' పిలుపు ఇతర రంగాలకు కూడా విస్తరించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చర్య టర్కీ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపడంతో పాటు, అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్‌కు మద్దతిచ్చే దేశాలకు ఒక హెచ్చరికగా నిలుస్తుందని పలువురు పేర్కొంటున్నారు. ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం టర్కీ అధ్యక్షుడు తయ్యిప్ ఎర్డోగాన్ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ను కలిసి మద్దతుగా నిలిచారు. అంతేకాదు, ఓ సైనిక రవాణా విమానం నిండా డ్రోన్లను పాక్ కు అందించినట్టు కథనాలు వచ్చాయి. భారత్ కూల్చిన డ్రోన్లలో టర్కీ తయారీ అసిస్ గార్డ్ సోంగర్ డ్రోన్ల శకలాలు కనిపించడం పాక్ కు టర్కీ సైనిక సాయం నిజమేనని నిర్ధారిస్తోంది. ఈ పరిణామం టర్కీ పట్ల భారత్ లో తీవ్ర వ్యతిరేకతను రాజేస్తోంది.

## వైసీపీకి మరో బిగ్ షాక్..!

వైఎస్ఆర్ సీపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఏపీలో ఇదివరకే ఐదుగురు వైసీపీ ఎమ్మెల్సీలు ఇదివరకే పార్టీని వీడారు. తాజాగా వైసీపీకి మరో ఎమ్మెల్సీ రాజీనామా చేశారు. ఏపీ శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియా ఖానం వైఎస్ఆర్సిపి కి రాజీనామా చేశారు. మరోవైపు ఎమ్మెల్సీ పదవికి సైతం ఆమె రాజీనామా చేశారు, ఈ మేరకు మండలి చైర్మన్ కు లేఖ సైతం రాశారు. వ్యక్తిగత సిబ్బంది ద్వారా తన రాజీనామా లేఖను మండలి చైర్మన్ కు ఆమె పంపినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో 2020 జూలైలో ఎమ్మెల్సీగా జాతీయ ప్రాణం ను గవర్నర్ నామినేట్ చేశారని తెలిసింది. రాయలసీమలోని అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన జకియాఖానం గత కొంతకాలం నుంచి వైసీపీలో అసంతృప్తిగా ఉన్నారు. ఇదివరకే ఐదుగురు వైసీపీ ఎమ్మెల్సీలు పోతుల సునీత, కర్రి పద్మశ్రీ, కళ్యాణ్ చక్రవర్తి, మర్రి రాజశేఖర్, జయ మంగళ వెంకటరమణ రాజీనామా చేశారు. తాజాగా జకియా ఖానం సైతం రిజైన్ చేయడంతో రాజీనామా చేసిన వైసీపీ ఎమ్మెల్సీల సంఖ్య ఆరుకు చేరింది.

## నేటినుండి కాళేశ్వరం సరస్వతి పుష్కరాలు..

మొదటి పేజీ తరువాయి
ప్రధానంగా ఈ కాళేశ్వరం వద్ద త్రివేణి సంగమం సరస్వతి నది అంతర్వాహినిగా ప్రవహిస్తుందని నమ్ముతారు. దక్షిణ భారతదేశంలో సరస్వతి పుష్కరాలు జరిగే ఏకైక పుణ్యక్షేత్రం కాళేశ్వరం కూడా కావడం అత్యంత విశేషం సంతరించుకున్నది. ఇక ఈ ఏడాది 2025 తెలంగాణలోని కాళేశ్వరం సరస్వతి పుష్కరాలు మే 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు అంటే 12 రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ఈ పుష్కరాలు గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంఘమం అయిన కాళేశ్వరం వద్ద జరుగుతుంది. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ఈ పుష్కరాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. డ్రైనేజీ వ్యవస్థ, రోడ్డు విస్తరణ అన్ని సౌకర్యాలు చేపట్టింది. ప్రధానంగా ఈ పుష్కరాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది.ఇక్కడ భక్తులు పుష్కర సమయంలో ప్రత్యేక పూజలు అమ్మవారికి నిర్వహిస్తారు. పుణ్యస్నానాలు చేసి హోమం వంటివి నిర్వహిస్తారు. సరస్వతి నదిలో స్నానం చేయటం వల్ల పాపములు నశించిపోతాయని నేను విశ్వసిస్తారు. ఈ నేపథ్యంలో ఎక్కువ శాతం మంది భక్తులు దేశం నలుమూలల నుంచి కూడా వచ్చే అవకాశం ఉంది. ప్రధానంగా దక్షిణ భారతదేశంలో సరస్వతి పుష్కరం ఇది ఒకటే కాబట్టి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. పుష్కరాల కోసం పోలీసుల పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసారు..మొత్తం 3 షిఫ్టుల్లో సుమారు 3500 మంది పోలీసుల విధులు నిర్వహిస్తారుపుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో మే 15 నుంచి మే 26 వరకు సరస్వతి పుష్కరాలు జరుగనున్నాయి. మే 15 ఉదయం 5 గంటల 44 నిముషాలకు సరస్వతీ పుష్కరాలను శ్రీ గురుమదనానంద సరస్వతి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి ఘనంగా ప్రారంభిస్తారు. ఇదే రోజు సాయంత్రం ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా కాళేశ్వరం చేరుకుంటారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. పుష్కరస్నానం ఆచరించిన తర్వాత కాళేశ్వరం ఆలయాన్ని దర్శించుకుంటారు. ఈ సందర్భంగా సరస్వతీ మాత విగ్రహావిష్కరణ, గోదావరి హారతి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. సరస్వతి పుష్కరాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలనియాజమాన్యం నిర్ణయించింది. ఉప్పల్, కూకట్ పల్లి, జీడిమెట్ల, మేడ్చల్ సహా నగరంలో పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. 40 మంది కలిసి పుష్కరాలకు వెళ్లాలని అనుకుంటే వారికోం ప్రత్యేక బస్సులు పంపేలా ఏర్పాట్లు చేశామన్నారు.పన్నెండేళ్లకోసారి జరిగే పవిత్రమైన పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్టం కలగకుండా సురక్షితంగా వారంతా పుష్కర స్నానం ఆచరించేలా టీజీఎస్ఆర్టీసీ అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. గ్రేటర్ హైదరాబాద్ జోన్ టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ఈ నెల 14 బుధవారం నుంచి 24వరకు ప్రత్యేక బస్సులను నడపనుందిభక్తుల రద్దీకి అనుగుణంగా ఈ బస్సులు ప్రధాన పుష్కర ఘాట్లకు అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించారుగ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాలైన జేబీఎస్, ఎంజీబీఎస్, ఉప్పల్, కూకట్ పల్లి, జీడిమెట్ల, మేడ్చల్ నుంచి మెట్రో డీలక్స్ బస్సులు నడుపనున్నారు. వివిధ ప్రాంతాల్లో ప్రత్యేకంగా.. ఒకే కాలనీలో 40 మంది ప్రయాణికులు ఉంటే ఆ కాలనీకే బస్సు పంపించే ఏర్పాట్లు చేశారు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు. ఇలాంటి ప్రత్యేక బస్సుల కోసం 9676671533, 9959226154, 9959226160 నంబర్లు సంప్రదించండి.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి 790 ప్రత్యేక RTC బస్సులు ఈ పుష్కరాలను వెళ్లనున్నాయి.

## చారిత్రక ఓరుగల్లులో అందాల భామల సందడి

మొదటి పేజీ తరువాయి
రామప్ప ఆలయం వద్ద చీరకట్టులో మెరిసిన అందాల భామలు గ్రూప్ ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. రామప్ప ఆలయ విశిష్టతను టూరిజం గైడ్లు వారికి వివరించారు. అంతకుముందు హరిత కాకతీయ వద్ద మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు. మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు రెండు బృందాలుగా ఏర్పడి వరంగల్ నగరంలో పర్యటిస్తున్నారు.

### భారీ పోలీసు భద్రత

మిస్ వరల్డ్ పోటీదారుల పర్యటన నేపథ్యంలో సుమారు వెయ్యి మంది పోలీసులతో భారీ భద్రత ఏర్పాటు చేశారు. ముగ్గురు డీసీపీలు, ఒక అదనపు డీసీపీ, 11 మంది ఏసీపీలు, 32 మంది ఇన్‌స్పెక్టర్లు, 81 మంది ఎస్సైలు, 115 మంది కానిస్టేబుళ్లు, 325 మంది మహిళా పోలీసు సిబ్బంది, 106 మంది హోంగార్డ్సు, 210 ప్రత్యేక పోలీసులు (డిస్ట్రిక్‌గార్డ్స్), బాంబ్ డిస్పోజల్, డాగ్‌స్క్వాడ్ బృందాలు బందోబస్తు విధుల్లో పాల్గొన్నాయి.

## అమెరికాలో నల్గొండ విద్యార్థిని కన్నుమూత

మొదటి పేజీ తరువాయి
నల్గొండ జిల్లా కట్టంగూరు మండలం పందెనపల్లికి చెందిన కొండి వెంకట్ రెడ్డి, శోభారాణి దంపతులకు కుమార్తె ప్రియాంక(26) అమెరికాలో అగ్రికల్చర్ ఎమ్మెస్సీ (మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ అగ్రికల్చర్) చదువుతోంది. అనారోగ్యంతో మృతి చెందడం విషాదాన్ని నింపింది.అలబామా యూనివర్సిటీలో ఎంఎస్సీ పూర్తిచేసిన ప్రియాంక అక్కడే పార్ట్ టైం వర్క్ చేస్తోంది. బ్రెయిన్ డెడ్ (మెదడు మృతి) స్థితికి చేరుకోవడంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది. దంత సంబంధిత అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లగా.. పరీక్షించి ఆమెకు బ్లడ్ ఇన్ఫెక్షన్ ఉందని తెలిపిన వైద్యులు తెలిపారు. స్నానం చేసేందుకు వెళ్లిన ప్రియాంక బాత్రూంలో పడిపోయి ఉండటాన్ని గమనించి స్నేహితులు ఆసుపత్రికి తీసుకువెళ్లగా.. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న ప్రియాంకను పరిశీలించి ఆమె బ్రెయిన్ డెడ్ అయిందని వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటన ఆమె కుటుంబ సభ్యులతో పాటు గ్రామంలోని సన్నిహితులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.

## 6000 మంది ఉద్యోగులు తొలగింపు

మొదటి పేజీ తరువాయి
ఫస్ట్ ఛాయిస్: ఉద్యోగుల సేవలు నిలిపివేసిన తర్వాత 60 రోజులపాటు జీతం ఇవ్వడం. ఆ ఉద్యోగులు బహుమతులు, బోనస్‌లు పొందడానికి అర్హులు. ఒక ప్రకటనలో మైక్రోసాఫ్ట్ ప్రతినిధి సీఎన్‌బీసీతో మాట్లాడుతూ.. డైనమిక్ మార్కెట్‌లో సంస్థ విజయానికి అవసరమైన నిర్మాణాత్మక మార్పులను ఎప్పటికప్పుడూ మార్పులు చేస్తుంటామని తెలిపారు. పనితీరు ఆధారంగా తొలగించనున్న ఉద్యోగులకు మెరుగు పడేందుకు సంస్థ కొంత సమయం ఇవ్వనుంది. లేదా వారు 16 వారాల వేతనంతో గ్లోబల్ వాలంటరీ సెపరేషన్ అగ్రిమెంట్ సెలక్ట్ చేసుకోవచ్చు. గత సంవత్సరం జూన్ నాటికి మైక్రోసాఫ్ట్‌లో మొత్తం 2,28,000 మంది ఉద్యోగులు ఉండగా, వారిలో వాషింగ్టన్‌లో 1985 మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. అందుకే సంస్థ తన మొత్తం ఉద్యోగులలో 3 శాతం మందిని తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఖర్చుల నియంత్రణతో పాటు కృత్రిమ మేధస్సు (AI)లో భారీ పెట్టుబడిని పెట్టాలని మైక్రోసాఫ్ట్ భావిస్తోంది. ఖర్చుల తగ్గింపు, కొత్త టెక్నాలజీ కోసం పెట్టుబడులు మళ్లించాలన్న నిర్ణయాలతో మైక్రోసాఫ్ట్ తన ఉద్యోగుల తొలగింపుపై నిర్ణయం తీసుకుంది. మైక్రోసాఫ్ట్ అన్ని నిర్వహణ నియంత్రణలను మరింత పెంచి, వ్యవస్థీకృత వర్క్ విధానం పాటించడంతో పాటు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పై ఫోకస్ చేస్తోంది. ఏఐపై భారీగా పెట్టుబడులతో కొత్త టెక్నాలజీ ఆవిష్కృతం చేసే దిశగా మైక్రోసాఫ్ట్ అడుగులు వేస్తోంది. కానీ మైక్రోసాఫ్ట్ నిర్ణయం కారణంగా కంపెనీ ఉద్యోగుల్లో 3 శాతం మంది ఉపాధి కోల్పోయి తీవ్ర సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలుస్తోంది.

## త్వరలోనే 'గ్రూప్స్' ఉద్యోగ నియామకాలు

మొదటి పేజీ తరువాయి
రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరంతో అదనంగా వెయ్యి ఎకరాలకు కూడా నీరు అందలేదు. కనీసం మట్టి పరీక్షలు కూడా చేయకుండా ప్రాజెక్టు నిర్మించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌ది" అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు.ఎస్ఎల్‌బీసీ, సీతారామ, దేవాదుల, నెట్టెంపాడు, సమ్మక్క సారక్క ప్రాజెక్టులను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేస్తామన్నారు. గ్రూప్-1 నియామకాలు అడ్డుకోవడం వెనుక ఉన్న రాజకీయ నాయకులు ఎవరో ప్రజలకు తెలుసన్నారు. త్వరలోనే గ్రూప్స్ నియామకాలు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం నోటిఫై చేసిన వరి విత్తనాలనే వినియోగించేలా అవగాహన కల్పించాలి

**- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**
**- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచండి**
**- వన మహోత్సవానికి అన్ని విధాలుగా సన్నద్ధం కావాలి**
**- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం**





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 14 :** ఖరీఫ్ సీజన్ లో రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేసిన (గుర్తించబడిన) వరి విత్తనాలనే జిల్లా రైతులు వినియోగించేలా క్షేత్రస్థాయిలో వారికి అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, హౌసింగ్ ఏ.ఈలు, ఎపిఓలు, సహకార శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సుదీర్ఘ సమీక్ష జరిపారు. ఖరీఫ్ పంటల సాగు ప్రణాళిక, అందుబాటులో ఉన్న ఎరువులు, విత్తన నిల్వలు, లైసెన్సుడ్ సర్వేయర్ల శిక్షణ, రేషన్ (ఆహార భద్రత) కార్డుల పరిశీలన, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతి, వన మహోత్సవం, రాజీవ్ యువశక్తి దరఖాస్తుల పరిశీలన తదితర అంశాల ప్రగతిని కలెక్టర్ ఒక్కో మండలం వారీగా సమీక్షిస్తూ, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసారి ఖరీఫ్ లో జిల్లా వ్యాప్తంగా 5.62 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగు చేస్తారని అంచనా కాగా, అందులో ఒక్క వరి పంటనే 4.37 లక్షల ఎకరాలలో సాగు చేసే అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. సన్నాలకు ప్రభుత్వం క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ అమలు చేస్తున్న నేపథ్యంలో పూర్తి విస్తీర్ణంలో సన్నరకం వరి పంట సాగు చేస్తారని భావిస్తున్నామని అన్నారు. అయితే ప్రభుత్వంచే గుర్తించబడిన సన్న రకాల ధాన్యం మాత్రమే కాకుండా మరికొన్ని ఇతర రకాల వరి వంగడాలను జిల్లాలోని కొంతమంది రైతులు వినియోగిస్తుండడం వల్ల ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యం సేకరణ సందర్భంగా పలు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఖరీఫ్ లో రైతులు ప్రభుత్వంచే గుర్తించబడిన 33 రకాల సన్న రకం వరి వంగడాలను వినియోగించేలా చూడాలన్నారు. సిద్ధి (డబ్ల్యుజిఎల్ 44), కాంపసాగర్ వేరైటి-1 (కేపిఎస్ 2874), సాంబ మసూరి (బిపిటి 5204), జగిత్యాల వేరైటి-3 (జిజిఎల్ 27356), జగిత్యాల వేరైటి-2 (జెజిఎల్ 28545), వరంగల్ సాంబా (డబ్ల్యుజిఎల్ 14), వరంగల్ సన్నాలు(డబ్ల్యుజిఎల్ 32100), జగిత్యాల మసూరి (జెజిఎల్ 11470), పోలాస ప్రభ (జెజిఎల్ 384), కృష్ణ (ఆర్ఎన్ఆర్ 2458), మానేరు సోనా (జెజిఎల్ 3828), తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048), వరంగల్ వేరైటి-1119, కూనారం వేరైటి-2 (కేఎన్ఎమ్ 1638), వరంగల్ వేరైటి-2 (డబ్ల్యుజిఎల్ 962), రాజేంద్రనగర్ వేరైటి-4 (ఆర్ఎన్ఆర్ 21278), కూనారం వేరైటి-1 (కేఎన్ఎమ్ 733), జగిత్యాల సన్నాలు (జెజిఎల్ 1798), జగిత్యాల సాంబా (జెజిఎల్ 3844), కరీంనగర్ సాంబా (జెజిఎల్ 3855), అంజన (జెజిఎల్ 11118), నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్ 34449), ప్రత్యుమ్న (జెజిఎల్ 17004), సుగంధ సాంబా (ఆర్ఎన్ఆర్ 2465), శోభిని(ఆర్ఎన్ఆర్ 2354), సోమనాథ్ (డబ్ల్యుజిఎల్ 347), ఆర్ఎన్ఆర్ 31479 (పిఆర్సి), కేపిఎస్ 6251 (పిఆర్సి), జెజిఎల్ 33124 (పిఆర్సి), హెచ్ఎమ్టి సోనా, మరుటేరు సాంబా (ఎంటీయూ 1224), మరుటేరు మసూరి (ఎంటీయూ 1262), ఎంటీయూ 1271 రకాలకు చెందిన సన్న ధాన్యం వరి వంగడాలను విత్తుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కాగా, ఖరీఫ్ లో పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు పూర్తి స్థాయిలో రైతులకు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలు జరుగకుండా గట్టి పర్యవేక్షణ జరపాలని, నకిలీ, నాణ్యాతా లోపంతో కూడిన వాటిని విక్రయించే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సహకార సంఘాలలో ఎరువుల వాస్తవ నిల్వలు ఏ మేరకు ఉన్నాయి, రికార్డులలో పేర్కొన్న వాటికి అనుగుణంగానే నిల్వలు అందుబాటులో ఉన్నాయా లేదా అన్నది క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని ఆదేశించారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా అన్ని సొసైటీలకు చెందిన సేల్ పాయింట్లు, ఎరువులను నిలువ చేసిన గిడ్డంగులను విధిగా సందర్శించి, ఎరువుల నిల్వల వాస్తవ వివరాలతో కూడిన నివేదికను వారం రోజుల్లోపు సమర్పించాలని కలెక్టర్ గడువు విధించారు. మరో రెండు వారాలలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్నందున ఎక్కడ కూడా ఎరువులు, విత్తనాల కొరత తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. కాగా, భూభారతి అమలులో భాగంగా లైసెన్సుడ్ సర్వేయర్ల శిక్షణ కోసం ఆసక్తి, అర్హత కలిగిన వారు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. ఇప్పటికే ప్రైవేట్ సర్వేయర్లుగా పని చేస్తున్న వారు ప్రభుత్వం నుండి లైసెన్సులు పొందేందుకు వీలుగా సీసీఎల్ఏ కమిషనర్ కార్యాలయానికి దరఖాస్తులు చేసుకునేలా ప్రోత్సహించాలని కలెక్టర్ తహసీల్దార్లకు సూచించారు. రేషన్ (ఆహార భద్రత) కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను, రాజీవ్ యువ వికాసం పథకం కింద దాఖలైన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరీలు పొందిన లబ్ధిదారులు అందరూ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కాకముందే నిర్మాణాలు చేపట్టి వేగవంతంగా పనులు జరిగేలా క్షేత్రస్థాయిలో నిశిత పర్యవేక్షణ జరపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జూన్ మొదటి, రెండవ వారంలో చేపట్టే వన మహోత్సవం కార్యక్రమానికి అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని సూచించారు. మొక్కల పంపిణీ కోసం నర్సరీలలో సరిపడా మొక్కలు అందుబాటులో ఉంచాలని, పంపిణీ చేసే ప్రతి మొక్కను నాటి కాపాడుకునేలా చూడాలన్నారు. పూర్తి స్థాయి లక్షయానికి అనుగుణంగా జిల్లాలో మొక్కల పెంపకం జరగాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీఆర్డీఓ సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బెజ్జోర బెజ్జమహాదేవి ఆలయంలో ఇటలీ సైనికుల బ్యాడ్జులు లభ్యం





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 14 :** కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కంకణాల రాజేశ్వర్, రాష్ట్ర కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ సంయుక్తంగా వెల్లడి.నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం లోని బెజ్జోర గ్రామంలోని బుజ్జమహాదేవి ఆలయాన్ని ఆలయ ధర్మకర్త వేముగంటి (జంగం) రాజేశ్వర్ ఆహ్వానం మేరకు బుధవారం ప్రముఖ చరిత్ర పరిశోధకుడు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కంకణాల రాజేశ్వర్ సందర్శించాడు. ఆలయం సందర్శనానంతరం గుడిలో ఒక మూలన పెట్టి ఉన్న రెండు బ్యాడ్జీలను కనుగొన్నాడు. వాటి ఛాయా చిత్రాల్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం రాష్ట్ర కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్కు చిత్రాలను పంపడంతో వాటి గురించి సమాచారాన్ని వెతికి వివరించారు. ఇటాలియన్ సైన్యం లోని కెప్టెన్ల బ్యాడ్జీలని, అందులో ఇటాలియన్ కొలోనియల్ హెల్మెట్(ఆర్టినరీ రెజిమెంట్ పీత్ హెల్మెట్)గా, రెండవది (ఇటాలి ఇటాలియన్ ఆర్మీ కావల్రీ క్యాప్ బ్యాడ్జ్) గా గుర్తించనైనది. ఈ సందర్భంగా కంకణాల రాజేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఈ బ్యాడ్జ్ లను అప్పటి సైనికులు ధరించే వారని అన్నారు. ఈ బ్యాడ్జీలు ఈ గుడిలోకి ఎలా వచ్చాయో తెలియ రావడం లేదు. కానీ గుడిలో భద్రపరచడం వల్లనే వీటి గురించి తెలుసుకునే అవకాశం లభించింది. ఈ బ్యాడ్జు (పతాకాలు) లను తెలంగాణ వారసత్వ శాఖ వారు మ్యూజియంలో భద్రపరచాలని స్థానికులు కోరుతున్నారు.

## బిబికే క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే సతీమణి కాంతా కుమారి



**గొల్లపెల్లి (మన వెలుగు) మే 14 :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లోని భీం రాజ్ పల్లి గ్రామంలో బి బి కే ( భీం రాజ్ పల్లి బొమ్మెన కుమార్ ) ఆధ్వర్యంలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ ను ప్రభుత్వ విప్పు ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సతీమణి కాంత కుమారి టాస్క్ వేసి బుధవారం ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. యువతను ప్రోత్సహించేందుకు ఏర్పాటుచేసిన సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు, బి బి కే ఫౌండర్ బొమ్మన కుమార్ ను కాంత కుమారి అభినందించారు.ఆయన చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 15 జట్లు కార్యక్రమంలో పాల్గొనిచుండగా అందరూ అద్భుతమైన ఆటను ప్రదర్శించాలని కోరారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని తద్వారా యువత ఆరోగ్యంగా ఉంటారని యువత క్రీడలపై దృష్టి సారించాలన్నారు. క్రీడల్లో యువత రాణించి రాష్ట్రానికి దేశానికి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బి బి కే ఫౌండర్ బొమ్మన కుమార్, గ్రామ పెద్దలు,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఝాన్సీ కంటోన్మెంట్ ఆర్మీ జాయింట్ కమాండ్ ఆఫీసర్ గా ప్రమోట్ అయిన మెట్ పల్లి వాసి



**మెట్ పల్లి (మన వెలుగు) మే 14 :** పట్టణానికి చెందిన ఆకుల లక్ష్మి-నర్సయ్య దంపతుల పెద్ద కుమారుడు అయిన ఆకుల ఆనంద్ 2005 వ సంవత్సరంలో ఆర్మీలో చేరి గత 20 సంవత్సరాలలో అంబలా, ఢిల్లీ,జమ్మూకాశ్మీర్, ఝాన్సీ, హర్యానా, చండీగఢ్, లేహ్, లద్దాక్, ఝాన్సీలో వివిధ హోదాలలో పనిచేసి బుధవారం ఝాన్సీ ఆర్మీ కంటోన్మెంట్ జూనియర్ కమాండ్ ఆఫీసర్గా పదోన్నతి పొందారు.ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు కుటుంబసభ్యులు ఎంతో సంతోషపడ్డారు. అంతేగాక మన ప్రాంత వాసి ఆర్మీలో ఉన్నత స్థానం పొందటం పట్ల పలువురు ఆనందం వ్యక్తం చేశారు. ఒక సామాన్య రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి కష్టపడి ఈ స్థాయికి రావడం ఎంతో గొప్ప విషయమని ఇలాంటి వారిని చూసి స్థానిక యువకులు ఆదర్శంగా తీసుకుని దేశసేవకు ముందుకు రావాలని పలువురు పిలుపునిచ్చారు.ఇక వీరి కుటుంబ విషయానికి వస్తే తల్లిదండ్రులు ఆకుల లక్ష్మి-నర్సయ్య మామూలు రైతులు నిరాక్షరాస్యులు అయినప్పటికీ వారి సంతానాన్ని ఎంతో కష్టపడి చదివించారు.వీరి కూతురు ఆకుల మంజుల గవర్నమెంట్ టీచర్ గా, పెద్ద కుమారుడు ఆనంద్ ఆర్మీ ఆఫీసర్,చిన్న కుమారుడు ఆకుల ప్రవీణ్ అడ్వకేట్ పనిచేస్తున్నారు. కష్టపడి పిల్లలను ఈ స్థాయికి తీసుకువచ్చిన వారి తల్లిదండ్రులను పలువురు అభినందించారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



**కోరుట్ల (మన వెలుగు) మే 14:** 44 కార్మిక చట్టాలను కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి మోడీ ప్రభుత్వం నాలుగు కోడ్ లుగా విభజించి కార్పొరేట్ సంస్థల యజమానులకు అనుకూలంగా మార్చటాన్ని వ్యతిరేకిస్తూ భారతదేశంలోని జాతీయ రాష్ట్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 20 తారీకు లో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా అసంఘటిత రంగంలోని సివిల్ సప్లై హమాలీ గోదాం హమాలి వ్యవసాయ మార్కెట్ హమాలి బజార్ హమాలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుతారి రాములు పిలుపునిచ్చారు. బుధవారం కోరుట్ల, మెట్ పల్లి డివిజన్ కేంద్రంలోని సివిల్ సప్లై బియ్యం గోదాముల వద్ద హమాలీ కార్మికులచే దేశ వ్యాప్త సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రెండుసార్లు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని మోడీ అంబానీ, ఆదాని లాంటి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చే విధానాన్ని పార్లమెంట్లో అమలు చేయకుండా కార్మిక సంఘాలు నిరోధిస్తున్నాయని, ఈ చట్టాలు అమల్లోకి వస్తే 8 గంటలకు బదులు 12 గంటలు పని చేయాలని సామాజిక భద్రత లేకుండా పోతుందని వేతనాలు పెంచకుండా సమ్మెలు నివారించడానికి యజమానులకు ఉపయోగపడుతుందన్నారు. దేశంలోని ఉద్యోగ కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నందున వెంటనే ఈ నాలుగు లేబర్ కోడలు రద్దు చేయాలని కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని దేశవాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్, నరసయ్య, ఇస్తారు రాజు, హమాలి కార్మికులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ సర్కార్.

**- మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి**



**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) మే 14 :** అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ సర్కార్ పెద్దపీటవేస్తుందని, అర్హులకు రేషన్ కార్డులు అందిస్తామని ఎవరు అనుకోలేదని, మామిడి మార్కెట్లో కామన్ యాక్షన్ పాయింట్ ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ అదనం కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత రవాణా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, రేషన్కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ, రూ.21 వేల కోట్లతో రైతు రుణమాఫీ చేసి దేశానికి ఆదర్శంగా నిలిచామన్నారు. రైతులను రుణవిముక్తులను చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.21 వేల కోట్లతో రుణమాఫీ చేస్తే రాజకీయ పార్టీలు ఈ విషయం మాట్లాడటం లేదని, కేవలం అసత్య ప్రచారాలకే పరిమిత కావడం హాస్యస్పదమన్నారు. రైతుల సౌకర్యార్థం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ధాన్యం డబ్బులను 48 గంటల్లోనే చెల్లిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెల్ల రేషన్కార్డుకు ప్రాధాన్యత పెరిగిందని, అర్హతకు అనుగుణంగా రేషన్ కార్డులు జారీ చేస్తామని, ప్రభుత్వం అమలు చేసే స్వయం ఉపాధి పథకాల అమలుకు, ఆరోగ్యశ్రీ, సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు కొలబద్ద కానుందన్నారు. అర్హత ఉన్నప్పటికీ సాంకేతిక కారణాలతో ఎవరికైనా రేషన్ కార్డులు జారీ కాకపోతే తన దృష్టికి తీసుకరావాలన్నారు. రేషన్ కార్డు దారులకు త్వరలోనే సన్నబియ్యంతో పాటు నిత్యావసరాలను అందిస్తామన్నారు. జగిత్యాల మామిడి మార్కెట్లో వేలం నిర్వహిస్తే రైతులకు మేలు జరుగుతుందని భావించి జిల్లా కలెక్టర్కు విన్నవిస్తే, జిల్లా కలెక్టర్ మామిడి మార్కెట్ను సందర్శించి వేలంపాట నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారని, మార్కెట్లో కామన్ ప్లేస్లో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించాల్సి ఉన్న మార్కెటింగ్ శాఖ అధికారుల నిర్లిప్తతతో రైతులు నష్టపోతున్నారని, మార్కెటింగ్ ఫీజు 4 శాతం ఉంటే వ్యాపారులు 10 శాతం వసూలు చేస్తున్నారని, ఏదేమిటని ప్రశ్నిస్తే అధికారులు తమకు ఎవరు కూడా ఫిర్యాదు చేయడం లేదని, మామిడి నాణ్యత ప్రమాణాల కోసం గ్రేడింగ్ పేరిట మరో 10 శాతం అధికంగా వసూళ్లకు పాల్పడుతున్న అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మార్కెట్లో అవకతవకలను ఆరికట్టేందుకు ఆర్డివోకు బాధ్యతలు అప్పగించాలన్నారు. మామిడి రైతులు నష్టపోకుండా ఉండాలంటే కమిషన్ 4శాతం, సూట్ 5 శాతానికి మించకూడదని, తక్ పట్టి వెంటనే జారీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజెంగి నందయ్య, జున్ను రాజేందర్, రమేష్ రావు, చాంద్ పాష, గుండ మధు, రమేష్ బాబు, మహేష్, మహిపాల్, సింగరావు, మొగిలి రఘువీర్, హరీష్, లైశెట్టి విజయ్, శీలం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

**పారిశుధ్య కార్మికుల సంక్షేమ మన అందరి బాధ్యత.....**

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

మన గ్రామ పంచాయతీలలో మల్టీ పర్పస్ వర్కర్లు గా పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సంక్షేమం మనందరి బాధ్యతగా భావించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.
బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో యూనిసెఫ్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల భద్రత రక్షణ గౌరవం అంశంపై ఎంపిడిఓ లకు , సంబంధిత అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మన గ్రామాల పరిశుభ్రతకు, ప్రజల ఆరోగ్య భద్రతకు నిరంతరం శ్రమిస్తున్న పంచాయతీ పారిశుధ్య సిబ్బంది క్షేమం, కుటుంబ భద్రత చూడాల్సిన అవసరం మనందరిపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.
పెద్దపల్లి జిల్లాలోని గ్రామాలలో పనిచేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్ లైన ప్రతి పారిశుధ్య కార్మికునికి తప్పనిసరిగా ప్రమాద బీమా గ్రామ పంచాయతీ నిధుల నుంచి ప్రీమియం చెల్లించి తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పి.ఎం.జే.జే.బి.వై, పి.ఎం.ఎస్.బి.వై పోస్టల్ వినియోగించుకొని బీమా తప్పనిసరిగా చేయించాలని అన్నారు.
పారిశుధ్య కార్మికులకు రెగ్యులర్ గా సమీపంలోనే ఆరోగ్య

# సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

**- కరీంనగర్ రూరల్ సిఐ ఏ నిరంజన్ రెడ్డి**

**కరీంనగర్ (మన వెలుగు) మే 14 :** వివిధ వర్గాలకు చెందిన ప్రజలు ఈమధ్య కాలంలో జరుగుతున్న వివిధ రకాల సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ రూరల్ సిఐ ఏ నిరంజన్ రెడ్డి అన్నారు. సెల్ ఫోన్లో వస్తున్న వివిధ రకాల మెసేజ్ లను గుడ్డిగా నమ్మి తెరవకూడదని సూచించారు.జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ఆలం రూరల్, రూరల్ ఏసిపి శుభం శుక్లా నగ్రాలా ఆదేశాల మేరకు బుధవారం నాడు కొత్తపల్లి మండలం రేకుర్తి లో గల లయోలా కాలేజీ ఆవరణలో దేశ సైన్యం, వివిధ రక్షణ విభాగాల్లో ఉద్యోగాల ఎంపిక కోసం శిక్షణ పొందుతున్న యువకులతో కరీంనగర్ రూరల్ సిఐ ఏ నిరంజన్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ మోసాలు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం - దుష్పరిణామాలు అంశం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రూరల్ సిఐ ఏ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ..వివిధ వర్గాలకు చెందిన ప్రజలు తమ కష్టార్జితంతో సంపాదించి బ్యాంకుల్లో దాచుకున్న డబ్బులను తస్కరించేందుకు సైబర్ నేరగాళ్లు పలు రకాల ఎత్తుగడలతో ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అనునిత్యం అప్రమత్తత అవగాహన కలిగి ఉండటాన్ని ఆయుధాంగా మలుచుకోవాలని చెప్పారు. తమ కుటుంబ సభ్యులు లేదా బంధువులు డిజిటల్ అరెస్ట్ అయ్యారంటూ సైబర్ నేరగాళ్లు బెదిరింపులకు పాల్పడుతున్నారని, చట్టపరంగా డిజిటల్



అరెస్ట్ అనేది ఉండదని స్పష్టం చేశారు. వివిధ వర్గాల ప్రజలను మానసికంగా ఒత్తిరికి గురిచేసి డబ్బులను కాజేసేందుకు సైబర్ నేరగాళ్ళు పాల్పడుతున్న చర్యలని గుర్తించాలని చెప్పారు. సెల్ ఫోన్, ఏ టి యం, క్రెడిట్ కార్డులకు సాధారణ పాస్ వర్డ్ లను వినియోగించకూడదని, తమకు మాత్రమే పరిమితం కాబడిన పాస్ వర్డ్ లను ఎంపిక చేసుకున్నట్లయితే ఎలాంటి మోసాలకు గురవ్వ కుండా ఉంటారని తెలిపారు. బ్యాంకు ఖాతాల నుండి సైబర్ నేరగాళ్లు డబ్బులను తస్కరించినట్లయితే వెంటనే 1930 నెంబర్ కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆకర్షణీయమైన ప్రకటనలను గుడ్డిగా నమ్మి మోసపోవద్దని తెలిపారు. ప్రజల బలహీనతలను ఆసరా చేసుకుని మోసగాళ్లు ఎత్తుగడలతో పన్నాగం పన్నుతున్నారని తెలిపారు.యువత మదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. వివిధ రకాల మత్తులకు బానిసలై యువత చేజేతుల భవిష్యత్తును నిర్వీర్యం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది యువత చెడు సహవాసాలతో తాత్కాలిక ఉపశమనం, ఉత్సాహం కోసం మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు అలవాటై తర్వాత బానిసలుగా మారి జీవితాలను చేజేతుల నాశనం చేసుకుంటున్నారన్నారు. చక్కటి క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకొని జీవితాలను ఆశయాలకు అనుగుణంగా తీర్చి దిద్దుకోవాల్సిన సమయంలో చెడు సహవాసాలతో గాడి తప్పడం విచారకరమని పేర్కొన్నారు. తాత్కాలిక ఉపశమనం, ఉత్సాహం కోసం మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలను సేవిస్తుండడం వల్ల ఒళ్ళు గుల్లగా మారి జీవచ్ఛవాలుగా మారడం, ఉన్మాదులుగా తయారవుతుండడం ఆందోళన కలిగిస్తున్నారని తెలిపారు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత విద్యాభ్యాసాలతో భావి భారత నిర్మాణంలో కీలకపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. చెడు సహవాసాలకు దూరంగా ఉండటం వల్లనే ఎంచుకున్న లక్ష్యాలను సాధించవచ్చనే విషయాన్ని యువత గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఎస్ ఐ ఎస్ సాంబమూర్తి, శిక్షణ విభాగం ఇన్చార్జి సతీష్ రెడ్డి లతో పాటుగా శిక్షణ పొందుతున్న 200 మంది యువకులు పాల్గొన్నారు.

## రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

**- అకాల వర్షాలకు తడిసిన ప్రతి గింజను ప్రభుత్వంమే కొనుగోలు చేస్తుంది**

**- ప్రభుత్వం అధికారులు ఇప్పటికే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు**

**- ప్రతి రైతుకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది**

**- తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన మంత్రి సీతక్క**

**ములుగు ప్రతినిధి (మన వెలుగు) మే 14 :** ఏటూరునగరం మండలం గోగుపల్లి గ్రామంలో లో నిన్న రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణనీటి సరఫరా శాఖ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి



అనసూయ సీతక్క ఈ సందర్భంగా మాట్లాడుతూ..తడిసిన ధాన్యాన్నీ కూడా ప్రభుత్వంమే కొనుగోలు చేస్తుంది.ఆరుగాలం కష్టం చేసి రైతులు పండిం చిన వరి ధాన్యం అకాల వర్షాలకు తడిసిన ముద్ద కావడం తో రైతులు ఆందోళన చెందుతున్నారు.ఈ నేపథ్యంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుంది.పంట నష్ట పరిహారం ఎంతైనా ప్రభుత్వంమే చెల్లిస్తుంది.నేరుగా రైతుల ఖాతాలో జమ చేస్తుంది.జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఇంకా ఎక్కడెక్కడ వరి ధాన్యం ఉన్న యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమములో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్

**- ఉపాధ్యాయులు నిత్యం విద్యార్థులనే అని మరిచిపోవద్దు అన్**

**ములుగు ప్రతినిధి (మన వెలుగు) మే 14 :** మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయాలని, ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్ ఉంటుందని మంత్రి వర్యులు సీతక్క అన్నారు. బుధవారం గోవిందరావుపేట మండలం



చల్వాయి మోడల్ స్కూల్లో అదేవిధంగా జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యా యులకు గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు సీతక్క మాట్లాడుతూ సమాజ స్థాపనలో విద్యార్థులను ఉత్తమమైన, ఆదర్శనీయమైన విద్యార్థు లుగా సిద్ధం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు ఉత్తమ విద్యార్థులను తయారు చేయగలుగుతారని, సామర్థ్యాల పెంపుకై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ప్రతి ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని, తాను నేర్చుకుంటూ విద్యాబోధన చేసినప్పుడే విద్యార్థులలో గుణాత్మకమైన మార్పు సాధించవచ్చునన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, నూతన విషయాలను తెలియజేస్తాయని, ప్రతి ఉపాధ్యాయుడు శిక్షణలో అంది స్తున్న అంశాలను ఆకలింపు చేసుకొని పాఠశాల స్థాయికి తీసుకెళ్లి విద్యార్థుల్లో ఆశించిన మార్పుల సాధన లక్ష్యంగా పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమములో జిల్లా గ్రంధాలయం సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ జిల్లా విద్యా శాఖ అధికారి ఫణిని తో మండల విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాక్షులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు.

## అకాల వర్షం నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తాం.....రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మాత్యులు డి.శ్రీధర్ బాబు

**తడిచిన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తాం**

**పంట నష్టం అంచనాలను తయారు చేయాలని వ్యవసాయ అధికారులకు ఆదేశం**

అకాల వర్షాల కారణంగా జిల్లాలో నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు డి.శ్రీధర్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాలలో తడిసిపోయిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం పూర్తి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు.

అకాల వర్షాల కారణంగా జిల్లాలో దెబ్బతిన్న పంట వివరాలను సేకరించి రైతులకు చెల్లించాల్సిన నష్ట పరిహారం పై నివేదిక అందించాలని మంత్రి వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అకాల వర్షాల కారణంగా ఏ రైతు నష్టపోకుండా ప్రభుత్వం తమ వంతు సహకారం అందిస్తుందని రైతులు ఎటువంటి ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని మంత్రి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి విద్యారణ్య పూరి (తుంకలగడ్డ) పరిగి లో భూ పరిశీలన



**200 కోట్లతో త్వరలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపడుతాం - ఎమ్మెల్యే టీ. రామ్మోహన్ రెడ్డి**



స్థానిక శాసనసభ్యులు డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి, టీజీ డబ్ల్యూ ఐడీసీ ఎండి గణపతి రెడ్డి పరిగి మునిసిపాలిటీ పరిధిలోని విద్యారణ్య పూరి (తుంకుల్ గడ్డ )యందు 200 కోట్ల రూపాయలతో నిర్మించబోతున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి కావాల్సిన స్థల పరిశీలన చేయడం జరిగింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని కులాల, మతాలకు సంబంధించిన విద్యార్థులు ఒకే పాఠశాలలో చదవాలని అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలని లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మాణం పూర్తి చేసి విద్యా సంవత్సరం ప్రారంభించాలనే లక్ష్యంతో ఇప్పటికే రాష్ట్రంలోని పలు నియోజకవర్గాలలో పనులు ప్రారంభమయ్యాయని, ముఖ్యమంత్రి పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దాలని ప్రధాన లక్ష్యంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్లు నిర్మిస్తున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.ఈ సందర్భంగా పరిగి నియోజక వర్గానికి సంబంధించి తుంకలగడ్డ విద్యారణ్యపూరిగా పేరుగాంచి అన్ని రకాల పాఠశాలలు కళాశాలలు ఉన్నటువంటి ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మించడం జరుగుతుందని తెలిపారు.పాఠశాల నిర్మాణానికి కావలసిన స్థలం వసతులను సంబంధిత శాఖ ఎండి గణపతి రెడ్డి స్థానిక ఎమ్మార్వో, సర్వేయర్లతో కలిసి స్థల పరిశీలన చేశారు. త్వరలో కావలసినంత స్థలాన్ని సేకరించి పాఠశాల నిర్మాణం చేపడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ ఎ అధ్యక్షులు పార్థసారథి పంతులు, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎర్రగడ్డ పల్లి కృష్ణ, డిసిసి ఉపాధ్యక్షులు లాల్ కృష్ణ ప్రసాద్, ఎమ్మార్వో ఆనందరావు, వైస్ చైర్మన్ అయూబ్, అనేం ఆంజనేయులు, చిన్న నరసింహులు, రాజా పుల్లారెడ్డి, ఘనేముని శ్రీనివాస్, సర్వర్, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలి

**- జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్**


**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) మే 14 :** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతుందని, కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని స్పీడ్ అప్ వేగవంతంగా కొనుగోలు చేయాలని జగిత్యాల



జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ ఏఎంసీ జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామం, జగిత్యాల మండలం గ్రామం బాలపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు వివరాలు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. వడగళ్ల వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున అందుబాటులో తార్పలిన్ కవర్లు, ఉండాలని అన్నారు . కొనుగోలు చేసిన ధాన్యం ను వెంటనే మిల్లులకు పంపించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలోని ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతుందని, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి వెంటనే మిల్లులకు తరలిస్తున్నామని, ప్రతిరోజు మిల్లులకు , రవాణా నిమిత్తం లారీల కొరత ఎక్కడా లేదని జిల్లా కలెక్టర్ తెలిపారు. రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం 17 తేమ శాతం రాగానే కాంటా వేసి కొనుగోలు చేసి సంబంధిత మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం రవాణా అంశంలో వాహనాల కొరత, హమా లీల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రైతులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ తనిఖీల్లో జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్, డిఎస్ఓ, డిఎం, తహసిల్దార్ శ్రీనివాస్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల మరియు బొడ్రాయి ప్రతిష్ట ప్రారంభోత్సవాలకు రండి

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారికి వెలిజర్ల శివాలయ పునర్నిర్మాణ కమిటీ ఆహ్వానం**



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో వెలిజర్ల గ్రామంలో నిర్వహించే శివాలయ, రామాలయ, నవగ్రహాలు, నాగదేవతలు, బొడ్రాయి, పోతురాజు విగ్రహాల మరియు ధ్వజస్తంభాల ప్రతిష్టాపన ప్రారంభోత్సవ కార్యక్రమానికి రావాలని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారికి శివాలయ పునర్నిర్మాణ కమిటీ వెలిజర్ల కరపత్రాన్ని అందజేసి ఆహ్వానించారు. తేదీ 19-05-2025 నాడు జరిగే ఈ ప్రతిష్ట ప్రారంభోత్సవ కార్యక్రమానికి గ్రామస్తులు పుర ప్రముఖులు అధికారులు స్థానిక నాయకులందరూ రానున్నందున స్థానికంగా ముఖ్యమైన మీరు రావాలని కోరారు ఆహ్వాన పత్రిక అందుకున్న స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అందుకు సానుకూలంగా స్పందిస్తూ గ్రామస్తులు నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటానని తెలిపారు, ఈ కార్యక్రమంలో శివాలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ వాద్యాల సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ దొడ్డి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కావలి నర్సింలు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ మరియు డిప్యూటీ సర్పంచ్ ఈరమోని రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మట్ట వెంకటేష్, సహాయ కోశాధికారి తుప్పరి

## ఘనంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

**ప్రత్యేక పూజలు చేసిన బీఆర్ఎస్ యువ నాయకుడు వై. మురళీకృష్ణ యాదవ్**

**పాల్గొన్న నాయకులు బెంది శ్రీనివాస్ రెడ్డి, ఈటె గణేష్, నరేందర్, నటరాజన్ తదితరులు**

ఫరూఖ్ నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నది. గణపతి, శ్రీరామచంద్రమూర్తి, శ్రీ ఆంజనేయస్వామి, కాశీ విశ్వేశ్వర నందీశ్వర, నవగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ యువ నాయకుడు వై.



మురళీకృష్ణ యాదవ్ విగ్రహా ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. హిందూ సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తూ, తమ ఇష్ట దైవాన్ని పూజిస్తే మనశ్శాంతి కలుగుతుందని అభిప్రాయపడ్డారు. గ్రామంలో దేవత మూర్తుల విగ్రహా ప్రతిష్ట మహోత్సవాని భక్తిశ్రద్ధలతో నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బెంది శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, మాజీ వైస్ చైర్మన్ నటరాజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, స్థానిక మాజీ సర్పంచ్ సాయిప్రసాద్ యాదవ్, నాయకులు వీరేశం గుప్తా, బచ్చలి నరసింహా, యాదయ్య, సంజీవయ్య, శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్, రామస్వామి తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# విద్యావేత్తగా కీర్తి?



కీర్తి సురేశ్

పాత్ర ఏదైనా తన నటనతో మెప్పించే కథానాయిక కీర్తి సురేశ్.. 'బేబీ జాన్'తో ఇటీవలే బాలీవుడ్‌లో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. దీని తర్వాత హిందీలో మరో ప్రాజెక్టు కోసం పలువురు దర్శకనిర్మాతలు ఆమెతో చర్చలు చేస్తున్నట్లు కొన్ని రోజులుగా నెట్టింట్లో వార్తలు సందడి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు మరో ఆసక్తికర విషయం బయటికొచ్చింది. దేశంలోని ప్రస్తుత విద్యా వ్యవస్థపై రూపొందుతున్న ఓ చిత్రంలో బాలీవుడ్ కథానాయకుడు రాజ్‌కుమార్ రావుతో కలిసి కీర్తి నటించనున్నట్లు సమాచారం. ఇంకా పేరు ఖరారు కాని ఈ ప్రాజెక్టును రాజ్ తన సొంత నిర్మాణ సంస్థపై తీర్చిదిద్దుతున్నారని తెలుస్తోంది. "ప్రస్తుతం విద్యను ఒక వ్యాపారంలా చేస్తున్నారు. ఈ వ్యవస్థలోని కుంభకోణాల్ని బయటపెట్టే విద్యావేత్తగా శక్తిమంతమైన పాత్రలో కనిపించనుంది కీర్తి. 'సెక్టార్ 36'ఫేమ్ ఆదిత్య నింబాల్కర్ దర్శకత్వం వహిస్తున్నారు. జూన్‌లో ముంబయిలో చిత్రీకరణ ప్రారంభం కానుంద"ని కీర్తి సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# రాజమౌళి 'ఈగ'తో మా సినిమాకు సంబంధం లేదు

'ప్రేమలు' తో తెలుగు ప్రేక్షకులను అలరించిన మలయాళ నటుడు మాథ్యూ థామస్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన సరికొత్త చిత్రం 'లవ్లీ' . ఒక మనిషికి ఈగతో ఏర్పడిన స్నేహం గురించి తెలియజేస్తూ రూపొందిన చిత్రమిది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా మాథ్యూ థామస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమ చిత్రానికి ప్రముఖ దర్శకుడు రాజమౌళి రూపొందించిన 'ఈగ' కు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. 'ఈగ' ఒక యాక్షన్ థ్రిల్లర్ చిత్రమన్నారు. తమ సినిమా ఏమాత్రం అలా ఉండదని తెలిపారు."ఇదొక విభిన్న కథా చిత్రం. ఒక మనిషికి, ఈగకు మధ్య ఉండే స్నేహాన్ని మనసుని హత్తుకునేలా రూపొందించాం. చాలా సరదాగా ఉంటుంది. ఇదొక ఫీల్‌గుడ్ ఫిల్మ్. ప్రేక్షకులు తప్పకుండా ఎంజాయ్ చేస్తారు. మా సినిమా ట్రైలర్ చూసి చాలామంది 'ఈగ'తో పోలుస్తున్నారు. కాకపోతే, ఈ రెండు చిత్రాలకు ఎలాంటి సంబంధం లేదు. మా సినిమా కథ విభిన్నంగా ఉంటుంది. 'ఈగ' ఒక యాక్షన్ థ్రిల్లర్ మూవీలా ఉంటుంది. ఆ సినిమాలో ఈగను ఒక హీరోగా చూపించారు. కానీ, మా సినిమాలో అలాంటిది ఏమీ ఉండదు. మా సినిమాలో ఈగ పేరు లవ్లీ. అందుకే మా చిత్రానికి ఆ పేరు పెట్టాం" అని మాథ్యూ తెలిపారు.తన గత చిత్రం 'బ్రొమాన్స్' గురించీ ఆయన మాట్లాడారు. ఆ సినిమాలో తన యాక్టింగ్‌పై వచ్చిన విమర్శలకు ఆయన స్పందించారు. "బ్రొమాన్స్'లో నేను బింటో పాత్రలో నటించా. కోపాన్ని కంట్రోల్ చేసుకోలేని వ్యక్తిగా కనిపించా. అందులోని కొన్ని సన్నివేశాల్లో నా యాక్టింగ్ బాగా లేదని చాలామంది కామెంట్స్ చేశారు. అయితే, పాత్రకు అనుగుణంగానే నేను యాక్ట్ చేశానని అనుకుంటున్నా. షూటింగ్ సమయంలోనూ ఎంతో ఆలోచించి.. చివరకు నా పాత్ర ఆవిధంగా రియాక్ట్ అయితేనే బాగుంటుందని మేము నిర్ణయించుకున్నాం. కాకపోతే సినిమా విడుదలయ్యాక ప్రేక్షకులకు అది నచ్చలేదని అర్థమైంది. వాళ్ల కామెంట్స్ విన్నాక నాక్కూడా కాస్త ఓవర్ యాక్టింగ్ చేసిన ఫీలింగ్ వచ్చింది" అని ఆయన చెప్పారు. మే 16న 'లవ్లీ' సినిమా విడుదల కానుంది. మలయాళంతోపాటు తెలుగులోనూ ఇది ప్రేక్షకులను అలరించనుంది.

# అలా చేస్తే నాలో కాళికాదేవిని చూస్తారు



ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు నటి ప్రీతి జింటా . తాజాగా ఎక్స్ వేదికగా అభిమానులతో ముచ్చటించారు. వారు అడిగిన ప్రశ్నలకు పలు ఆసక్తికర సమాధానాలిచ్చారు.

**కొత్తగా ఉద్యోగంలో చేరే వాళ్లకు మీరిచ్చే సలహా ఏంటి?**

ప్రీతి జింటా: నేను కెరీర్ ప్రారంభించినప్పుడు ఎప్పుడూ ఆర్థికంగా స్వతంత్రంగా ఉండాలని, నా కాళ్లపై నేను నిలబడాలని అనుకునేదాన్ని. ఇతరులపై ఆధారపడడం నాకు అసలు ఇష్టం ఉండదు. నా జీవితంలో చిన్నతనం నుంచే కష్టపడి పనిచేయాలని, వచ్చిన అవకాశాలను వదులుకోకూడదు అని అనుకుంటూ పెరిగాను. మీరూ అలాగే ఆలోచించండి. అప్పుడే మనం ముందుకుసాగగలం.

**మీ బ్యూటీ సీక్రెట్ ఏంటి?**

ప్రీతి జింటా: ఇలా కనిపించడం వారసత్వం అనుకుంటాను. నేను చాలా సింపుల్‌గా ఉంటాను. ఎక్కువగా నీళ్లు తాగుతాను. సన్‌స్క్రీన్ లోషన్స్ వాడతాను. అన్నిటికంటే ముఖ్యంగా ఎక్కువసేపు నిద్ర పోతాను. అలాగే పాజిటివ్‌గా ఉండడం వల్ల కూడా అందంగా కనిపిస్తామని నమ్ముతాను.

**మీకు ఇష్టమైన ఆహారం ఏంటి?**

ప్రీతి జింటా: మా అమ్మ చేతివంట ఏదైనా ఇష్టమే. పరోట, కిచిడి అంటే బాగా ఇష్టం.

**ఆపరేషన్ సిందూర్‌పై చాలామంది బాలీవుడ్ తారలు స్పందించలేదు. మీరు స్పందించడం ఆనందంగా ఉంది?**

ప్రీతి జింటా: అందరి గురించి నేను మాట్లాడలేను. ఎందుకంటే ఒక్కొక్కరి అభిప్రాయాలు ఒక్కోలా ఉంటాయి. నేను సైనిక నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చాను కాబట్టి అలాంటి విషయాలు వింటే నేను చలించిపోతాను. అందుకే నేను కచ్చితంగా స్పందిస్తాను.

**హైదరాబాద్ బిర్యానీ తిన్నారా?**

ప్రీతి జింటా: మహా కుంభమేళాకు వెళ్లడానికి మూడు వారాల ముందు నుంచి నేను శాకాహారిగా మారిపోయాను. ఇప్పటికీ అలానే ఉన్నాను. అందుకే బిర్యానీ తినలేదు.

**మీ సినిమాలు దేనికైనా సీక్వెల్ తెరకెక్కాలని భావిస్తున్నారా?**

ప్రీతి జింటా: సంఘర్ష్ సినిమాకు సీక్వెల్ రావాలని కోరుకుంటున్నా.

**ఎన్నిసార్లు చూసినా బోర్ కొట్టని సినిమా ఏది?**

ప్రీతి జింటా: చాలా ఉన్నాయి. ఒక్కటి అంటే చెప్పడం కష్టం. కుచ్ కుచ్ హోతా హై, అందాజ్ అప్నా అప్నా.. ఇలా ఎన్నో సినిమాలున్నాయి.

**మీకు నచ్చిన సూక్తి ఏదైనా చెప్పండి?**

ప్రీతి జింటా: విజయానికి దగ్గర దారి ఉండదు. కష్టపడి పనిచేయడం మాత్రమే దారి.

**కల్ హో నాహో సినిమాలో మీ నటన అద్భుతంగా ఉంటుంది? ఆ సినిమా చూస్తూ ఎన్నోసార్లు ఏడ్చేశాను. అందులో మీ నటన చూస్తే మీకు ఎలా అనిపిస్తుంది?**

ప్రీతి జింటా: నేను ఆ సినిమా చిత్రీకరణ సమయంలోనూ ఏడ్చాను. అందులోని చాలా సన్నివేశాల్లో నటీనటులంతా సహజంగానే ఏడ్చారు. అమన్ చనిపోయే సీన్ తర్వాత చిత్రబృందమంతా కన్నీరు పెట్టుకుంది.

**అపజయాలను ఎలా తట్టుకోవాలి?**

ప్రీతి జింటా: ఫెయిల్యూర్స్ నేర్పినన్ని పాఠాలు ఎవరూ నేర్పలేరు. కష్టం తర్వాత వచ్చే విజయాన్ని ఎప్పటికీ మర్చిపోలేము.

**యూత్‌కు మీరిచ్చే సలహా ఏంటి?**


ప్రీతి జింటా: ఫోన్ వాడడం తగ్గించండి. జీవితంలోని ప్రతి క్షణాన్ని ఆస్వాదించండి.

**మీ అభిమానులకు తెలియని ఒక విషయం పంచుకోండి?**

ప్రీతి జింటా: నాకు ఆలయాలకు వెళ్లినప్పుడు ఫొటోలు తీసుకోవడం నచ్చదు. అలాగే విమాన ప్రయాణం చేసిన తర్వాత, తెల్లవారుజామున నాకు పిక్స్ తీసుకోవడం నచ్చదు. అలాగే నా అనుమతి లేకుండా నా పిల్లల ఫొటోలు తీస్తే మీరు నాలో కాళికా అవతారాన్ని చూస్తారు.

**కోహ్లి రిటైర్మెంట్‌పై మీ స్పందన ఏంటి?**

ప్రీతి జింటా: నేను కోహ్లి కోసమే టెస్ట్ క్రికెట్ చూసేదాన్ని. క్రికెట్ అంటే అతడికి ఉన్న తపన తన ఆటతీరులో కనిపిస్తుంటుంది. టెస్ట్ క్రికెట్ ఇకపై గతంలోలా ఉంటుందని నేను అనుకోవడం లేదు. విరాట్, అశ్విన్, రోహిత్‌లను ప్రస్తుతం ఉన్న ఆటగాళ్లు భర్తీ చేయాల్సి ఉంటుంది.



# 'కింగ్‌డమ్' వాయిదా.. కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడంటే!

విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రానున్న చిత్రం 'కింగ్‌డమ్' మే 30న విడుదల కావాల్సిన ఈ సినిమా తాజాగా వాయిదా పడింది. దీన్ని జులై 4న విడుదల చేయనున్నట్లు టీమ్ తెలిపింది. ఈమేరకు ఓ నోట్‌ను పంచుకుంది."అనుకున్న సమయానికి సినిమాను రిలీజ్ చేయాలని ఎంతో ప్రయత్నించాం. కానీ, ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా దీన్ని వాయిదా వేస్తున్నాం. ఇలాంటి సమయంలో ప్రచారాలు, సెలబ్రేషన్స్ అంటూ సందడి చేయకూడదు. అందుకే మేం సినిమా జులై 4న ప్రపంచవ్యాప్తంగా మీ ముందుకు తీసుకురానున్నాం. మీ అందరూ సహకరిస్తారని ఆశిస్తున్నాం" అని టీమ్ తెలిపింది.మొదట ఈ సినిమాను మార్చిలో విడుదల చేయాలని భావించారు. మే 30కు వాయిదా పడింది. ఇప్పుడు మరోసారి జులై 4కు వెళ్లింది. విజయ్ సరసన భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్న ఈ సినిమాలోని పాటలు ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంటున్నాయి. ఇటీవలే ఇందులో 'హృదయం లోపల' అంటూ సాగే పాటని విడుదల చేయగా సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది. పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న 'కింగ్‌డమ్'లో విజయ్ దేవరకొండ గూఢచారిగా కనిపించనున్నారు.

# అలాంటి దేశాల కోసం డబ్బు ఖర్చు చేయొద్దు: నిఖిల్



భారత్ - పాక్ ఉద్రిక్తతల వేళ తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ వ్యవహరించిన తీరుపై టాలీవుడ్ నటుడు నిఖిల్ అసహనం వ్యక్తంచేశారు. భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించే దేశాల కోసం డబ్బు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదన్నారు. విహారయాత్రల కోసం ఆయా దేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. 'మంచి లేదా చెడు పాక్‌తో మేము సత్సంబంధాలు కొనసాగిస్తాం' అంటూ ఎర్డోగాన్ చేసిన వ్యాఖ్యలపై ఒక నెటిజన్ సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టాడు. దీనిని నిఖిల్ తాజాగా ఎక్స్ వేదికగా షేర్ చేశారు. "ఇంకా ఎవరైనా తుర్కియే వెళ్లాలనుకుంటున్నారా? దయచేసి ఒక్కసారి ఈ పోస్ట్ చూడండి. భారతీయులు ప్రతి ఏడాది తుర్కియేలో పెద్దమొత్తంలో ఖర్చు పెడుతుంటారు. మన దేశానికి వ్యతిరేకంగా వ్యవహరించే వారి కోసం మీ డబ్బు ఖర్చుపెట్టడం దయచేసి మానండి" అని నిఖిల్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులు, వారి స్థావరాలను అంతం చేయడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ ను భారత్ చేపట్టగా.. ఆ సమయంలో పాకిస్థాన్‌కు తుర్కియే అనుకూలంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడి జరిగిన తర్వాత ప్రపంచమంతా ఉగ్రవాదుల చర్యలను ఖండిస్తున్న సమయంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను ఎర్డోగాన్ కలిశారు. ఆ దేశానికి వత్తాసు పలికారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించలేదు సరికదా.. మృతిచెందిన పర్యాటకుల కుటుంబాలకు సానుభూతి కూడా వ్యక్తం చేయడానికి ఇష్టపడలేదు. ఎర్డోగాన్ ప్రభుత్వం తీరుపై మన దేశంలో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. 'బాయ్‌కాట్ తుర్కియే' పేరుతో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది.